క్లుప్తంగా

రేపట్నుంచి 'హై లైఫ్ ఎగ్జిబిషన్'



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఈ నెల 21, 22 తేదీలలో 'హై లైఫ్ ఎగ్జిబిషన్' ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశంలోని ప్రముఖ డిజైనర్ల ద్వారా ఎంపిక చేయబడిన అత్యాధునిక దుస్తులు, ఆభరణాలు, ఫ్యాషన్ ఉపకరణాలు, గృహాలంకరణ వస్తువులు, ఆకర్షణీయమైన కలెక్షన్స్ ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తామన్నారు. పండుగలు, ప్రత్యేక సందర్భాలలో అవసరమైన ఆభరణాలు, ప్రత్యేకమైన జీవనశైలి వస్తువుల కోసం ఎదురు చూసేవారికి గమ్యస్థానంగా ఈ ఎగ్జిబిషన్ నిలుస్తుందని, లగ్జరీ షాపింగ్ అనుభవం కలిగిస్తోందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గుణదల 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నుంచి విజయవాడ టౌన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉపకేంద్రాలకు వచ్చే 33 కేవీ మల్టీ సర్క్యూట్ ఫీడర్లలో గురువారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ట్రీ కటింగ్, మెయింటెన్స్ పనులు నిర్వహిస్తున్నట్లు టౌన్ ఈఈ రవీంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో 33 కేవీ మాచవరం, చుట్టుగుంట, సీతారామపురం, మధురానగర్, దుర్గాపురం, ముత్యాలంపాడు, సిటీ (గవర్నరుపేట) సబ్ స్టేషన్‌లలో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా, ప్రత్యామ్నాయ ఫీడర్ల ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఆయా సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉదయం 7గంటల నుంచి 10 గంటల మధ్య విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉందని వివరించారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రైతులకు విశిష్టసంఖ్య తప్పనిసరి



పాయకాపురం(విజయవాడరూరల్): రైతులంతా తప్పనిసరిగా విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్ సూచించారు .మండలంలోని కుందావారి కండ్రికలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భగా రంగనాథ్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలు, పంట రుణం, పంటకు గిట్టుబాటు ధర, యంత్రపరికరాలు పొందేందుకు రైతులకు ఈ విశిష్ట సంఖ్య ఎంతో అవసరమని వివరించారు. ఉద్యానశాఖ అధికారి వి.నీలిమ మాట్లాడుతూ మామిడితోటల్లో తామర పురుగు అధికంగా కనబడుతోందని, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు యరగొర్ల శ్రీరాములు, గ్రామ రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో వైద్య సేవలందించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సామాజిక బాధ్యతగా పేదలకు రాయితీతో కూడిన మెరుగైన దంత వైద్యసేవలు అందించాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ శివారెడ్డి, ఏ విద్యాసాగర్ అన్నారు. గుణదలలో ఏర్పాటు చేసిన ఐకాన్ దంతవైద్యశాలను బుధవారం వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదప్రజలకు రాయితీపై వైద్యం అందిస్తానన్న దంతవైద్యుడు సీహెచ్ ప్రణీత్‌ను అభినందించారు. ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.జగదీశ్వరరావు, కె.రంగారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణరెడ్డి, పి. రమేష్, సీహెచ్ మధుసూధనరావు, నగర శాఖ కార్యవర్గ సభ్యులు సీవీఆర్ ప్రసాద్, ఎస్‌కే నజీరుద్దీన్, మాజీ నాయకులు జి.నారాయణరావు, జె.రాజారావు, మహిళా నాయకురాలు కె.శివలీల పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): చికిత్స పొందుతున్న ఓమహిళ మృతిచెందడంపై పోలీసులు బుధవారం అనుమానస్పద మృతి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు..పదేళ్లుగా వెన్ను, తలనొప్పితో బాధపడుతున్న విలేజి కండ్రికకు చెందిన మండల సునీత(41) ఈనెల 16వతేదీన గడ్డిమందు తాగడంతో కుటుంబసభ్యులు ఆమెను చికిత్సనిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈక్రమంలో ఆమె బుధవారం మృతి చెందింది. మృతిరాలి భర్త పున్నారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఇష్టారీతిన ఆక్రమణలు

నిద్ర నటిస్తున్న వీఎంసీ ప్లానింగ్ విభాగం



కండ్రికలో ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన షాపు

పాయకాపురం(విజయవాడరూరల్): డ్రైనేజీ కాల్వలు.. ఫుట్‌పాత్‌లు.. మెయిన్‌రోడ్డు వెంబడి స్థలాలు కావేవి ఆక్రమణలకు అనర్హం అన్నట్లుగా పలువురు ఆయా ప్రాంతాలకు ఆక్రమించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రాజకీయ నాయకుల అండదండలతో 62, 63, 64వ డివిజన్లలో ఈ అడ్డగోలుగా ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. డ్రైనేజీ కాల్వలపై, ఫుట్‌పాత్‌లు, విజయవాడ-నూజివీడు ప్రధాన రహదారి వెంబడి ఎక్కడ కాస్తంత ఖాళీస్థలం కనిపిస్తే అక్కడ పచ్చబోర్డులు పెట్టి ఆక్రమించేస్తున్నారు. ఆయా స్థలాల్లో కిచిడి బండ్లు, కూల్‌డ్రింక్స్ బడ్డీకొట్లు, ఫ్రూట్స్ బండ్లు, పూలకొట్లు, చికెన్ షాపులు, కిరాణా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.

పచ్చబోర్డులు ఏర్పాటు చేసి మరీ..

ఆక్రమణదారులు ఆయా ఆక్రమిత స్థలాల్లో ఏర్పాటు చేస్తున్న బోర్డులపై పసుపుపచ్చ రంగులు వేస్తుండటంతో విజయవాడ నగర పాలక సంస్థకు చెందిన ప్లానింగ్ విభాగం అధికారులు అటువైపు కూడా చూడటం లేదు. అధికార పార్టీ నాయకులే మామూళ్లు వసూలు చేసుకుంటూ ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. 64వ డివిజన్‌లో శానిటరీ ఇన్స్‌పెక్టర్ కార్యాలయం వద్ద ఓ స్థలాన్ని ఆక్రమించి వ్యాపారం చేస్తుండగా, 63వ డివిజన్లో రాజీవ్‌నగర్ మెయిన్‌రోడ్డు వద్ద స్థలాన్ని ఆక్రమించుకొని వ్యాపారాలు నిరాటంకంగా సాగిస్తున్నారు. 62వ డివిజన్ ప్రకాష్‌నగర్ మెయిన్‌రోడ్డును ఆనుకొని, నూజివీడు ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకొని వాటర్ ట్యాంక్ సమీపంలో ఈ ఆక్రమణలు అధికంగా ఉన్నారు. ఆయా దుకాణాల్లో పగలు చిల్లరకొట్టు వ్యాపారాలు సాగుతున్నాయి. రాత్రివేళ్లల్లో మాత్రం గంజాయి విక్రయాలు, మద్యం విక్రయాలు జోరుగా జరుగుతున్నట్లు సమాచారం. పోలీసులు సైతం ఈ వ్యవహారాలను చూసిచూడనట్లు వ్యవహరిస్తుండగా, ఈ వ్యాపారాల నిర్వహణలో మహిళలే కీలకంగా వ్యవహరిస్తుండటం గమనార్హం.



కండ్రికలో రోడ్డు ఆక్రమించి ఏర్పాటు చేసిన షాపు



డ్రైనేజీపై సాగుతున్న వ్యాపారం

పూడిక తీతకు ఇబ్బందే..

డ్రైనేజీ,ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకున్నవారు కాల్వను మూసివేసి వాటిపై భాగంలో రేకులు అమర్చి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో డ్రైనేజీ కాల్వలో పూడిక తొలగించే వీలులేని పరిస్థితి ఉంది. డ్రైనేజీ కాల్వపై మూతలను పగులకొట్టేందుకు అధికార పార్టీ నాయకులు అడ్డుపడుతున్నారనే వ్యాఖ్యలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

తరచూ రోడ్డు ప్రమాదాలు..

రోడ్డు పక్కనున్న స్థలాలు ఆక్రమణలకు గురికావడంతో నిత్యం రద్దీగా ఉండే పైపులరోడ్డు, ప్రకాష్‌నగర్, కెనరాబ్యాంక్,పోలీసు స్టేషన్ రోడ్డు, పాయకాపురం, భవానీ బార్(కండ్రిక జంక్షన్)వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు ఆక్రమణలతోపాటు హోటల్స్, బార్ అండ్ రెస్టారెంట్లు వద్ద మద్యం ప్రియులు రోడ్డుపైనే తమ ద్విచక్రవాహనాలను పార్క్ చేయడంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఆక్రమణల కారణంగా ప్రమాదాలు..



మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు పెరిగిపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు ఆక్రమణలు తొలగించడంతోపాటు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలి.

– జి.కుమార్, ప్రకాష్‌నగర్

ఆక్రమణలు పెరిగిపోయాయి...



ఆక్రమణలు రోజుకురోజుకు పెరిగిపోతుండగా, పట్టించుకోవాల్సిన అధికారులు ఆవైపు చూడటం లేదు. ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీ కాల్వలపై వ్యాపారాలు చేస్తుంటే కాల్వల్లో పూడికతీత ఎలా తీస్తారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలి.

– కోటేశ్వరరావు,కండ్రిక

అధికారుల్లో లోపించిన 'ప్లానింగ్'

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొత్తలో ఆక్రమణల తొలగింపు పేరుతో ప్లానింగ్ విభాగం అధికారులు హడావుడి చేశారు. వైఎస్సార్ సీపీ నాయకలు, మాజీ కార్పొరేటర్లు వీర్ల వరలక్ష్మి, జగదీష్‌ల సొంత ఆస్తులను ధ్వంసం చేశారు. కాని ప్రస్తుతం యథేచ్ఛగా సాగుతున్న ఆక్రమణలు..ఏర్పాటు చేస్తున్న దుకాణాలు ఏమాత్రం కనిపించనట్లే ప్లానింగ్ విభాగం అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా వీఎంసీ ప్లానింగ్ అధికారులు స్పందించి ఆయా రోడ్లలోని ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బుడమేరులో దోమల నివారణ చర్యలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరులో దోమల నివారణచర్యలు చేపట్టారు. ఇటీవల బుడమేరులో గుర్రపు డెక్క పెరిగిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి.దీనిపై సాక్షి పలుమార్లు కథనాలు ప్రచురించింది. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు స్పందించి బుడమేరులో గుర్రపు డెక్కను తొలగించడంతోపాటు దోమల నివారణచర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు బుడమేరులో పడవల సహాయంతో దోమల నివారణ మందు స్ప్రే చేశారు.

23 నుంచి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ లీగ్

విజయవాడస్పోర్ట్స్: అండర్–10, 12 బాలుర జిల్లాస్థాయి బ్లూ క్లబ్స్ ఫుట్‌బాల్ లీగ్‌ను ఈనెల 23వ తేదీ నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు శేషగిరిరావు, చక్రవర్తి బుధవారం తెలిపారు. విజయవాడ సత్యనారాయణపురంలోని రైల్వే కాలనీ గ్రౌండ్‌లో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే 12 జట్లు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఫుట్‌బాల్ క్లబ్స్, స్కూల్స్ జట్లను ఈ పోటీలకు ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనదలచినవారు సెల్‌నంబర్లు 7569051099, 9492552566లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకూడదు

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నమవకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఉన్న సమావేశ హాలులో ఇంజినీరింగ్ సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని, ప్రత్యేకించి కొండప్రాంతాలకు ఎలాంటి లోటు లేకుండా తాగునీటి సరఫరా జరగాలని స్పష్టంచేశారు. అందుకు అనుగుణంగా కావాల్సిన వాహనాలను, వాటర్ ట్యాంకర్లను సమకూర్చుకోవాలని సూచించారు. జనాభా ఎక్కువగా ఉన్నచోట తాగునీటి సౌకర్యాలను మరింత పెంచాలన్నారు. నగర పరిధిలోని తాగునీటి ప్రాజెక్టులు, పార్కుల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందీ కలగకుండా, ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రస్తుతం ఉన్న అన్ని బోరులను ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు నగరంలోని అన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలాంటి నీటి లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా సర్కిళ్ల పరిధిలోని అసిస్టెంట్ ఇంజినీర్లు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల నుంచి వారు విధులు నిర్వహిస్తున్న వార్డు, ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించే దిశగా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

పరమత సహనానికి ప్రతీక ఛత్రపతి శివాజీ



శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అతిథులు, శివాజీ, జిజియాభాయి వేషధారణలో చిన్నారులు

విజయవాడ కల్చరల్: జాతికి స్ఫూర్తి నింపిన మహనీయుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని రాష్ట్రీయ స్వయంసేవక్ విభాగ్ ప్రచారక్ నవీన్ అన్నారు. శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ స్మారక సమితి ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్ రోడ్డు శారదా కళాశాల సమీపంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. బాలబాలికలకు శివాజీ వేషధారణ పోటీలను నిర్వహించారు. నవీన్‌జీ మాట్లాడుతూ పరమత సహనానికి ప్రతీక శివాజీ మహారాజు అని తెలిపారు. శివాజీ జీవితం రాజ్యపాలనను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ శివాజీని విజయాలవైపు మళ్లించిన ఆయన తల్లి జిజియాభాయి మహనీయురాలన్నారు. తాళ్లాయపాలెం శైవపీఠాధిపతి శివస్వామి మాట్లాడుతూ బీఆర్‌టీఎస్ రోడ్డును శివాజీమార్గ్‌గా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాగలింగం శివాజీ, చల్లా లక్ష్మీనారాయతోపాటు విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు. అతిథులు శివాజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

ఆకట్టుకున్న వేషధారణలు..

ఛత్రపతి శివాజీ, ఆయన మాతృమూర్తి జిజియాభాయి వేషధారణల్లో చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు. విజ్ఞాన విహార్ విద్యార్థులు ప్రదర్శించిన ఘోష్(వాయిద్య విన్యాసం),చింతా వెంకట్ బృందం చేసిన సంప్రదాయ నృత్యాలు అందరినీ అలరించాయి.



ఛత్రపతి శివాజీకి నివాళులర్పిస్తున్న కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు

ఛత్రపతి శివాజీ గొప్ప యోధుడు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశం గర్వించదగ్గ గొప్పయోధుడు ఛత్రపతి శివాజీ అని రామ్మోహన గ్రంథాలయ కమిటీ అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు అన్నారు. బందరు రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు కలసి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ దేశ చరిత్రలో శివాజీ మహరాజ్ పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. ఉపాధ్యక్షులు దమ్మాల రామచంద్రరావు మాట్లాడుతూ శివాజీ చిన్నతనంలోనే మొఘలులపై పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ వేములపల్లి కేశవరావు, గ్రంథాలయ సభ్యులు చిగురుపాటి నరేష్, పవన్, కోట కృష్ణభగవాన్, శివాజీ గ్రంథాలయ సభ్యులు, సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలకు పదును పెట్టాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు పట్టుదలతో తమలోని నైపుణ్యాలకు పదును పెట్టి ముందుకు సాగితే మంచి ఫలితాలను అందుకోవచ్చని ఐమీస్ మేనేజింగ్ డైరెక్టర్ డి.నాగలక్ష్మి అన్నారు. కేబీఎన్ కళాశాల పీజీ విభాగం ఆధ్వర్యంలో మస్త్ 2కే25 పేరుతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ బుధవారం ఉత్సాహ భరితంగా సాగింది. ఈ సందర్భంగా ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో ఎప్పటికప్పుడు మారుతున్న పోకడలను అవగాహన చేసుకుంటూ తమ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ అకడమిక్ అంశాలతో పాటు కల్చరల్, కో కరిక్యులర్ యాక్టివిటీస్‌కు తమ కళాశాల అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

వ్యక్తిత్వ నైపుణ్యాలు పెరుగుతాయి..

పీజీ కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వేంకటేష్ మాట్లాడుతూ. పోటీల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ నైపుణ్యాలు పెరుగుతాయని చెప్పారు. హైస్కూల్స్ కమిటీ ఏఓ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, కళాశాల కమిటీ అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు, ఎం. వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ సీతారామపురంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో లబ్బీపేటలోని దర్స్ గాహ్-ఎ-ఇస్లామి విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించిన విద్యార్థులు షీమాఫిర్దోస్, సనా, జోయ, మలిషా, అయేషా, అనిషా, సమి, హైదర్ సని, సహా, తాల్హా, రెహ్మాన్, బేగ్, రజా, బిలాల్, ఫర్హాన్, సదాబ్ రజా, రఫీజ్, సిద్దిక్, జకిర్, ఫౌజాన్, ఇసాక్, ఎండీ రెహ్మాన్, హజ్మా, తహిర్‌అలీ, అబ్దుల్ ఫర్హాన్, హకీమ్, సయ్యద్ కాజా, ఆహ్మద్, అస్రార్, సుహేబ్‌లు కుమితే, కటా విభాగాల్లో పతకాలు సాధించడంతోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులు, కరాటే మాస్టర్ ఎండీ ఆరీఫ్‌ను స్కూల్ ప్రిన్సిపాల్ సయ్యద్ గౌస్‌బాషాఇలియాస్, డీవీసీ అధ్యక్షులు ఎండీ రఫీక్, ఉపాధ్యక్షులు డాక్టర్ సాదిక్‌మోహియుద్దీన్, కార్యదర్శి మహ్మద్ ఖాన్‌ఉమ్రి స్కూల్ ఆవరణలో బుధవారం అభినందించారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

మాజీఎమ్మెల్యే మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): తీవ్రనష్టాలను ఎదుర్కొంటున్న మిర్చి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓవైపు ధరలు పడిపోయి దిగుబడిలేక రైతన్నలు కష్టాలు పడుతుంటే.. కూటమి సర్కార్‌కు చీమ కుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. గత నాలుగేళ్ల లాభాలు చూసిన మిర్చిసాగు రైతులు... ఈ ఏడాది ధరలు పడిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఉమ్మడి కృష్ణాజిల్లాతోపాటు గుంటూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప జిల్లాలలో సుమారు 1.96లక్షల హెక్టార్లలో మిర్చి సాగు చేశారన్నారు. 11.67లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావాల్సి ఉన్నా.. తామర, జెమిని వైరస్‌ల ప్రభావంతో దిగుబడి దారుణంగా పడిపోయి ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్లు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ సమయంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుండటంతో ఎన్టీఆర్ జిల్లాలో సాగు చాలా వరకు తగ్గిపోయిందని విచారం వ్యక్తంచేశారు. గతేడాది నందిగామ నియోజకవర్గంలో 8వేల ఎకరాలలో మిర్చి సాగు చేయగా.. ఈఏడాది 5,374 ఎకరాలకే పరిమితమైందన్నారు. జిల్లాలో మిగిలిన నియోజకవర్గాలలోనూ గతేడాదితో పోలిస్తే మిర్చిసాగు చాలా వరకు పడిపోయిందని గుర్తుచేశారు. ఎరువులు, పురుగుల మందుల ధరలు, కూలీలు, రవాణా ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయన్నారు. ఫలితంగా ఎకరాకు రూ. 1.50 లక్షల వరకు రైతన్నలు పెట్టుబడి పెట్టాల్సి వచ్చిందని.. అయితే గోరుచుట్టుపై రోకలి పోటులా ధరలు రైతన్నకు కంటతడి పెట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

జగనన్న పాలనలో రికార్డు స్థాయిలో ధరలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాం మిర్చి రైతుకు స్వర్ణయుగం లాంటిందని మల్లాది విష్ణు గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రికార్డు స్థాయిలో ధరలు లభించడంతోపాటు దిగుబడులు బాగా వచ్చాయన్నారు. గత ప్రభుత్వంలో మిర్చి క్వింటా రూ. 22 వేలు పలుకగా, ఈఏడాది రూ. 11 వేలు మించి లేకపోవడం శోచనీయమన్నారు. మరోవైపు దిగుమతి వ్యాపారులు కమిషన్ పేరుతో దండుకుంటుండటంతో రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి మిర్చి సహా ఆయా పంటలను సాగుచేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు.



అర్థంతరంగా నిలిపివేసిన నిర్మాణ పనులు



కాలేజీలో తిరుగుతున్న కుక్కలు

ఉర్దూ కళాశాలపై చిన్నచూపు !



తాగిపడేసిన మద్యం బాటిల్



ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న నీరు

కబేళా సెంటర్‌లోని గవర్నమెంట్ జూనియర్ ఉర్దూ కళాశాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందనే విమర్శలున్నాయి. గత ప్రభుత్వంలో నాడు–నేడు పథకం కింద అదనపు తరగతి గదుల అంతస్తును నిర్మించారు. ప్రభుత్వం మారడంతో ఈ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. కళాశాలకు ప్రహరీ కూడా లేకపోవడంతో మద్యం, గంజాయి బ్యాచ్‌కు ఇది అడ్డాగా మారింది. దీనికి తోడు పిచ్చిమొక్కలు పెరగడంతో చిట్టడవిని తలపిస్తోంది. అధికారులు, నేతలు స్పందించి వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కాలేజీ ప్రాంగణంలో అల్లుకున్న పిచ్చిమొక్కలు

ఆర్థిక నిర్వహణపై అవగాహన అవసరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులకు ఆర్థిక నిర్వహణపై అవగాహన అవసరమని ప్రముఖ ఆర్థిక విశ్లేషణ నిపుణుడు చిలుకూరి విజయకుమార్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజిమెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్స్' అంశంపై వర్క్‌షాప్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆర్థిక నిర్వహణపై పట్టు సాధించడం ద్వారా అనేక విజయాలను అందుకోవచ్చన్నారు. సేవ్ ఫస్ట్-స్పెండ్ నెక్ట్స్ నినాదంతో ముందుకు అడుగులు వేయాలన్నారు. స్టాక్ ఎక్స్ఛేంజ్, సెక్యూరిటీ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ వంటి అంశాలపై పట్టు సాధించాలని చెప్పారు.

ఆర్థికాంశాలపై పట్టు సాధించాలి..

కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ రంగాలతో పాటుగా ఆర్థికాంశాలపై పట్టు సాధించడంతో మరిన్ని విజయాలను అందుకోవటానికి అవకాశముంటుందన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత ఆర్థిక నియంత్రణ, పెట్టుబడుల ప్రాముఖ్యత, ప్రణాళిక తదితర అంశాలపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శరవణకుమార్, విభాగాధిపతి డాక్టర్ ఎస్.మణికంఠ, కోఆర్డినేటర్ ఎస్.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.